ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 26 అక్టోబరు 2024



నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

- ఉదయం పది గంటలకు పండుగలా ప్రారంభం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

- 10లో


మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

కొండవాగు కబ్జా

పంచదార్లలో వైసీపీ నేతలు భూ దందా

- అధికారంలో ఉన్నప్పుడు యథేచ్ఛగా ఆక్రమణ
- జిరాయితీ భూముల పక్కన 5.48 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- లేఅవుట్‌లో కలిపేసుకుని ఇళ్ల స్థలాలుగా అమ్మకం
- ఆక్రమణదారులతో కుమ్మక్కైన నాటి రెవెన్యూ అధికారులు
- మార్కెట్ ధర ప్రకారం భూమి విలువ రూ.5 కోట్లు పైమాటే!


గెడ్డ వాగును కలిపేసుకొని లేఅవుట్ గోడ నిర్మించిన కబ్జాదారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు జిల్లాలో పలుచోట్ల ప్రభుత్వ భూములు, స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేశారు. రెవెన్యూ రికార్డుల్లో వాగులు, వంకలు, కొండపోరంబోకు గెడ్డ భూములుగా నమోదైన వాటికి నకిలీ పత్రాలు సృష్టించి, తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. కొంతమంది నియోజకవర్గస్థాయి నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ కొండవాగు పోరంబోకు భూముల్లో లేఅవుట్‌లు వేశారు. వైసీపీ నేతలు పాల్పడిన భూ ఆక్రమణలు.. కూటమి ప్రభుత్వం కొద్ది రోజుల నుంచి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో బయటపడుతున్నాయి. వైసీపీ నేతల భూ కబ్జాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. రాంబిల్లి మండలం పంచదార్ల రెవెన్యూ పరిధిలో సుమారు ఐదున్నర కోట్ల రూపాయల విలువ చేసే గెడ్డ వాగును కబ్జా చేసి వైనం ఇప్పుడు వెలుగు చూసింది.


పంచదార్లలో కుంచించుకుపోయిన కొండపోరంబోకు గెడ్డ

5.48 ఎకరాల గెడ్డ వాగు కబ్జా

పంచగార్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 68లో ఐదు ఎకరాల 48 సెంట్లలో గెడ్డ వాగు వుంది. ఎగువన వున్న కొండల్లో కురిసిన వర్షం నీటిని నిలువ చేసి, రైతుల పొలాలకు అందించడానికి గతంలో జలవనరుల శాఖ అధికారులు ఇక్కడ చెక్ డ్యామ్‌ను నిర్మించారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు స్థానిక ముఖ్యనేత, గాజువాకకు చెందిన మరో వైసీపీ నేత కుమారుడు, స్థానిక నాయకులతో కలిసి సర్వే నంబరు 68కి ఆనుకొని జిరాయితీ భూముల్లో భారీ లేఅవుట్ వేశారు. ఈ సమయంలో కొండపోరంబోకు గెడ్డను కూడా లేఅవుట్‌లో కలిపేసుకున్నారు. కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షం నీరు ధారభోగాపురం, పంచదార్ల, అప్పారాయుడుపాలెం గ్రామాల పరిధిలో 500 నుంచి 600 ఎకరాలకు అందేది. అయితే వైసీపీ నేతలు కొండపోరంబోకు గెడ్డను ఆక్రమించి, లేఅవుట్‌లో కలిపేసుకోవడంతో పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ప్రత్యేక ఆర్థిక మండలికి అతి చేరువలో, గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారికి సమీపంలో వున్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎకరా కోటి రూపాయలకు పైగా ధర పలుకుతున్నది. పంచదార్లలో సర్వే నంబరు 68లో వైసీపీ నేతలు ఆక్రమించిన కొండపోరంబోకు గెడ్డ భూమి విలువ రూ.5 కోట్ల పైగాను వుంటుంది. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు, భూ ఆక్రమణదారులకు సహకరించినట్టు ఆరోపణలు వినిపించాయి.

కాగా పంచగార్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 68లో ఐదు ఎకరాలకుపైగా కొండ పోరంబోకు గెడ్డ ఆక్రమణకు గురికావడంపై రాంబిల్లి తహసీల్దారు శ్రీనివాసరావును వివరణ కోరగా, గెడ్డ భూముల ఆక్రమణపై విచారణ జరిపిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే చట్టపరంగా చర్యలు తీసుసుకుంటామని స్పష్టం చేశారు.

ఉచితం దుర్వినియోగం

శారదా నదిలో మూలపేట వద్ద దర్జాగా ఇసుక అక్రమ తవ్వకాలు

- టైరు బండ్లతో ఒడ్డుకు తరలింపు
- లారీల్లోకి లోడింగ్ చేసి చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా
- లోడు రూ.10-15 వేలకు విక్రయం
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు


శారదా నది తీరంలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు


లారీలో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

కొత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విధానాన్ని కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇళ్లు నిర్మించుకునే వారు సొంత అవసరాల నిమిత్తం స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో టైరు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని వెసులుబాటు కల్పించింది. అయితే ఇందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అనుమతులు తీసుకోవాలి. కానీ ఉచితం మాటున పలువురు వ్యక్తులు దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. నదులు, గెడ్డల్లో నుంచి టైరు బండ్లతో ఇసుకను బయటకు తీసుకువచ్చి సమీపంలో కుప్పలుగా నిల్వ చేస్తున్నారు. అనంతరం లారీల్లోకి లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఉచిత ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే అనకాపల్లి జిల్లాలో ఎక్కడా అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. రాజమహేంద్రవరం వద్ద గోదావరి నుంచి ఇసుకను రప్పించాల్సి వస్తున్నది. ఇసుక తవ్వకాలు, లోడింగ్, రవాణా చార్జీలు కలిసి తడిసి మోపెడవుతున్నది. దీనివల్ల సామాన్య భవన నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో ఇసుక లభ్యతను అధికారులు గుర్తించి, తవ్వకాలకు సచివాలయాల ద్వారా అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారు టైరు బండ్లు (ఎడ్ల బండ్లు) లేదా ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చు. దూర ప్రాంతాలకు రవాణా చేయడం, విక్రయించడం చేయకూడదు. కానీ జిల్లాలోని పలుచోట్ల నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇదే తరహాలో అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట వద్ద శారదా నది తీరంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు టైరు బండ్ల యాజమానులను ఇక్కడకు రప్పించి, నదిలో ఇసుక తవ్వించి, ఒడ్డున కుప్పలుగా పోయిస్తున్నారు. అనంతరం లారీల్లోకి లోడింగ్ చేయించి పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. లారీ ఇసుకను దూరాన్నిబట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. మూలపేట నుంచి రోజూ పదికిపైగా లారీల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. సచివాలయాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలు ఇసుక తవ్వకాలు, రవాణా సాగుతున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు పట్టించుకోవడంలేదు.


శారదా నది ఒడ్డున నిల్వ చేసిన ఇసుక కుప్పలు

తాగునీటి పంపుహౌస్ ముప్పు

అనకాపల్లి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు తుమ్మపాల వద్ద శారదా నదిలో పంప్‌హౌస్ వుంది. దీనికి అతిచేరువలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో భారీ గోతులు ఏర్పడుతున్నాయి. వీటి వల్ల తాగునీటి పథకం పంప్‌హౌస్‌కు ముప్పు పొంచి వుందని స్థానికులు అంటున్నారు.

కాగా సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట వద్ద శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ కె.విజయ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఉచితంగా ఇసుక తీసుకువెళ్లాలంటే అనుమతి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణదారుడు, తన పరిధిలోని గ్రామ/ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దానిని ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించి సంబంధిత ఇంటి నిర్మాణానికి ఎంత మేరకు ఇసుక అవసరమవుతుందో అంచనా వేసి, ఆ మేరకు సచివాలయం కార్యదర్శి అనుమతి ఇస్తారని తెలిపారు. మూలపేట వద్ద శారదా నదిలో ఇసుక తవ్వకాలకు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, సిబ్బందిని అక్కడకు పంపించి పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

ఏయూలో డ్యూయల్ డిగ్రీలు

- బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులు
- వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వెల్లడించారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డు ఆఫ్ స్టడీస్ సమా వేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతి పాదిస్తున్నామన్నారు. బీటెక్‌లో వీఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అలాగే అనివార్య కార ణాల వల్ల మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం (2018 తరువాత విద్యార్థులకు మాత్రమే) రీ ఎగ్జామి నేషన్స్ నిర్వహించాలని నిర్ణయించినట్టు వీసీ తెలిపారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాల్లో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయ రావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ఎ.నరసింహారావు, జి.గిరిజాశంకర్, కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ప్రొఫెసర్ డి.నాగరాజ కుమారి పాల్గొన్నారు.

సంక్షేమంపై శీతకన్ను

వసతిగృహాలకు నాలుగు నెలల బిల్లులు పెండింగ్

- కంటింజెంట్ బిల్లుల పరిస్థితీ అంతే!
- అప్పులు చేసి హాస్టళ్లను నడుపుతున్న వార్డెన్లు
- భారంగా మారిన వసతిగృహాల నిర్వహణ
- సత్వరమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి వినతి


చోడవరంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహం

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు నాలుగు నెలలుగా డైట్ (భోజనం) బిల్లుల చెల్లింపులు నిలిచి పోయాయి. ఈ ఏడాది జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క నెలకు కూడా నిధులు విడుదల కాకపోవడంతో వసతి గృహాల నిర్వహణకు అప్పులు చేయవలసి వస్తున్నదని వార్డెన్లు వాపోతున్నారు. డైట్ బిల్లులతోపాటు ఇతర కంటింజెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో వుండడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో హాస్టల్‌కు కనిష్ఠంగా రూ.4 లక్షలు, గరిష్ఠంగా రూ.12 లక్షల మేర బిల్లులు పేరుకుపోయినట్టు సమాచారం.

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ-మెట్రిక్, పోస్టు మెట్రిక్ వసతిగృహాలు 38 ఉన్నాయి. హాస్టళ్ల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ పరంగా బియ్యం మినహా మిగిలిన నిత్యావసర సరకులైన పప్పులు, వంటనూనె, కూరగాయలు, వంట గ్యాస్, ఇతర దినుసులను వార్డెన్లు ముందుగా సొంత సొమ్ముతో కొనుగోలు చేసి, విద్యార్థులకు భోజనాలు సమకూర్చాలి. ప్రభుత్వం ప్రీ-మెట్రిక్ విద్యార్థికి నెలకు రూ.1,400, పోస్టు మెట్రిక్ విద్యార్థికి రూ.1,600 చొప్పున చెల్లిస్తుంది. మార్కెట్‌లో నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ ఈ డబ్బులతోనే మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు పెట్టాలి. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అధిక వడ్డీలకు అప్పులు చేసి సరకులు కొనుగోలు చేయాల్సి రావడం, ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తుండడంతో వసతిగృహాల నిర్వహణ తలకు మించిన భారంగా మారిందని వార్డెన్లు వాపోతున్నారు. తమ చేతిలో డబ్బులు లేకపోతే.. కిరాణా సరకులు అరువుపై ఇవ్వడానికి వ్యాపారులు సైతం విముఖత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంటింజెంట్ బిల్లులు సైతం పెండింగ్

హాస్టళ్ల విద్యార్థులకు ఇచ్చే డైట్ బిల్లులతోపాటు, వసతిగృహాల నిర్వహణకు ఇచ్చే కంటింజెంట్ బిల్లులు కూడా నెలల తరబడి మంజూరు కాని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు, ప్లంబింగ్, కార్పెంటరీ, వగైరా మరమ్మతు పనులకు కూడా సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్టు వార్డెన్లు చెబుతున్నారు. తమకు వచ్చే జీతాల సొమ్ము మొత్తం ముందస్తుగా హాస్టళ్ల నిర్వహణకు ఖర్చుచేయాల్సి వస్తున్నదని, ఇది చాలక అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి బిల్లుల పెండింగ్‌లో ఉండడం వల్ల హాస్టళ్ల నిర్వహణ తమకు పెను భారంగా మారిందని, డైట్ బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో ఉన్నతాధికారులు సైతం చెప్పే పరిస్థితి లేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల కోడిగుడ్లు పక్కదారి

స్టీల్ క్యాన్‌లో నింపుకుని ఇంటికి తీసుకెళుతున్న భోజన పథకం నిర్వాహకులు

- దారిలో అడ్డగించి పట్టుకున్న స్కూల్ కమిటీ చైర్మన్

ఎస్.రాయవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):


స్టీల్ క్యాన్‌లో కోడి గుడ్లు తీసుకెళుతూ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌కు చిక్కిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు జామి కొర్లమ్మ

మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను వంట పథకం నిర్వా హకులు పక్కదారి పట్టిస్తున్నారు. కోడిగుడ్లను ఒక స్టీల్ క్యాన్‌లో పెట్టుకుని ఇంటికి తీసుకెళు తున్న భోజన పథకం నిర్వాహకురాలిని స్కూల్ కమిటీ చైర్మన్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మండలంలోని రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 280 మంది విద్యా ర్థులు వున్నారు. వీరికి రోజూ (శనివారం మినహా) మధ్యాహ్న భోజనంలో ఉడికించిన కోడిగుడ్డు కూడా పెడతారు. అయితే వివిధ కారణాల వల్ల కొంత మంది విద్యార్థులు గుడ్డు తినడం లేదు. కానీ భోజన పథకం నిర్వాహకులు ఈ విషయాన్ని హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లకుండా, మిగిలిన కోడిగుడ్లను ఇంటికి తీసుకెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు జామి కొర్లమ్మ శుక్రవారం విద్యార్థులకు భోజనాలు వడ్డించిన తరు వాత ఒక స్టీల్ క్యాన్‌తో ఇంటికి బయలు దేరింది. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎ.ఎర్రయ్యకు అనుమానం వచ్చి ఆమెను ఆపి క్యాన్‌ను తెరిచారు. క్యాన్ నిండుగా కోడిగుడ్లు వున్నాయి. క్యాన్‌తో సహా ఆమెను పాఠశాలకు తీసుకెళ్లి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. కోడిగుడ్లను తీసుకెళ్లడంపై ఆమెను ప్రశ్నించగా, మధ్యాహ్నం భోజనంలో కొంతమంది పిల్లలు కోడిగుడ్లు తినడం లేదని, ఆ కోడిగుడ్లను తీసుకెళుతున్నానని బదులిచ్చింది. ఈ విషయాన్ని మండల, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు హెచ్ఎం శ్రీనివాసరావు చెప్పారు.

బాబోయ్ పీఆర్ ఆఫీస్

శిథిలావస్థలో ఈఈ కార్యాలయ భవనం

- ఊడిపోయిన శ్లాబ్ పెచ్చులు
- వర్షం కురిస్తే కారిపోతున్న భవనం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

నర్సీపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైఅంతస్థు శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి వర్షం పడితే నీరు కారుతున్నది. అప్పుడప్పుడు కాంక్రీట్ పెచ్చులు ఊడి పడుతున్నారు. పై అంతస్థులో వున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ గదుల్లో శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో ఖాళీ చేసి కింది అంతస్థులోకి మారారు.




సూపరింటెండెంట్ గదిలో శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

గ్రామాల్లో రహదారుల నిర్మాణం, పంచాయతీ కార్యాలయాలకు నిధులు మంజూరు చేసే పంచాయతీ రాజ్ శాఖ... సొంత భవనం పరిస్థితి అధ్వానంగా ఉంది. అధికారులు, వివిధ మండలాల నుంచి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సివిల్ కాంట్రాక్టర్లు పంచాయతీరాజ్ కార్యాలయానికి తరచూ వస్తుంటారు. నర్సీపట్నంలోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో డీఈఈ కార్యాలయం, పై అంతస్థులో ఈఈ ఆఫీసు నిర్వహించేవారు. డీఈఈ ఆఫీసులో నలుగురు ఏఈలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు పని చేస్తున్నారు. ఈఈ ఆఫీసులో సూపరింటెండెంట్‌తో సహా 15 మంది ఉద్యోగులు వున్నారు. నాలుగైదు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో పైఅంతస్థు మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే శ్లాబ్ కారిపోతున్నది. ఈ అంతస్థులో వుండే ఈఈ, సూపరింటెండెంట్ ఖాళీ చేసి కింది అంతస్థులోకి మార్చేశారు. పైఅంతస్థులో ఇంకా ఒకరిద్దరు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

ఇదిలావుండగా కింద అంతస్థులో చివరి మూడు గదులకు చిన్నపాటి మరమ్మతులు చేయించి ఈఈ, సూపరింటెండెంట్, సిబ్బంది వుంటున్నారు. మొదటి రెండు గదుల్లో డీఈఈ ఒక గదిలో, ఏఈలు, సిబ్బంది ఒక గదిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా వస్తే కనీసం కుర్చీ వేసి కుర్చోబెట్టడానికి కూడా స్థలం లేదు. కాగా కింద అంతస్థు శ్లాబ్ కూడా పెచ్చులు ఊడి పోతున్నది. అధికారులు, ఉద్యోగులు ఉండే ఆఫీసు గదుల ముందు భాగం శ్లాబ్ పెచ్చులు ఊడి, రాకపోకల సమయంలో వారి మీదనే పడుతున్నాయి. ప్రస్తుతం పెచ్చులు పడుతున్నాయని, ఏదో ఒక రోజు భవనం శ్లాబ్ కూలిపోయి, తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బంగారమ్మపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

ఎస్.రాయవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా చెప్పారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంతో పాటు స్థానిక ఎన్‌ఏవోబీ ప్రాంతాలను శుక్రవారం సాయంత్రం ఎస్పీ సందర్శించారు. ఎన్‌ఏవోబీ నిర్మాణ పనులు, మత్స్యకారుల సమస్యలకు సంబంధించిన విషయాలపై ఆయా ప్రాంతాలకు వెళ్లి ఎస్పీ పరిశీలించారు. అనంతరం పలు విషయాలపై అక్కడి నేవీ అధికారులతో చర్చించారు. తిరిగి వెళ్తుండగా కొంత మంది విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ ఇక్కడి మత్స్యకారుల చేపల వేటకు సంబంధించిన సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే మార్గాల గురించి చర్చించడం జరిగిందన్నారు. అలాగే స్థానిక మత్స్యకారులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

సీడ్స్ కంపెనీ అధికారులు పంటల పరిశీలన



కోటవురట్ల: గవరపేటలో కేళీలు వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో వరి సాగు చేసిన రైతులు పంటంతా కేళీలు, పొల్లకాయలు ఉండడంతో నష్టపోయామని లబోదిబో మంటున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి సరోజని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, జిల్లా అధికారులు స్పందించి సీడ్స్ కంపెనీవారికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం కోటవురట్ల గ్రామంలో నకిలీ విత్తనాల కారణంగా కేళీలు, పొల్లకాయలు ఉన్న వరిపంటను ఏపీసీడ్స్ అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో రైతులకు వరి విత్తనాలు సరఫరా చేసింది ఏపీసీడ్స్ కంపెనీవారు కాదని, డెల్టా కంపెనీ వారని విచారణ తేలినట్టు ఏవో సరోజని తెలిపారు. డెల్టా కంపెనీ వారు వచ్చిన వరి పొలాలను పరిశీలిస్తారని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదబోది గల్లం జడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ , ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, కుమారి, రమేశ్‌బాబు, చిన్నారావు, శ్రీదేవి మెటీరియల్ కొనుగోలు చేసి అందించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని వారు చెప్పారు.

ప్రధాన మార్గం.. ఫ్లెక్సీలతో ప్రమాదకరం!

మెయిన్ రోడ్డులో ఫ్లెక్సీ బోర్డులతో భయం భయం

పట్టించుకోని అధికార గణం.. పాలకులదీ అదే వ్యవహారం



పాయకరావుపేటలో ఎస్‌బీఐ దగ్గర ఐరన్ ఫ్రేమ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పాయకరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఒక వ్యాపార సంస్థ యజమాని ఐరన్ ఫ్రేమ్‌తో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ప్రమాదకరంగా మారింది. పాయకరావుపేటలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు ఉన్న మెయిన్ రోడ్డును పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల వ్యాపార సంస్థల యజమానులు రోడ్డును ఆక్రమించి షెడ్డులు, ఫ్లెక్సీ బోర్డులు వేయడంతో మెయిన్‌రోడ్డు మూడింట ఒక వంతు కుంచించుకుపోయి తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఇది చాలదన్నట్టుగా స్థానిక ఎస్‌బీఐ వద్ద ఉన్న ఒక వ్యాపార సంస్థ నిర్వాహకులు మెయిన్ రోడ్డుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని భారీ ఇరన్ ఫ్రేమ్‌తో ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేయడంతో ఆ ప్రదేశం ప్రమాదకరంగా మారింది. నిబంధనల ప్రకారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నాలుగు అడుగులు ఖాళీ స్థలం విడిచిపెట్టాల్సి ఉండగా, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రదేశంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కి కనీసం అడుగు దూరం కూడా లేకుండా ఐరన్ ఫ్రేమ్ ఏర్పాటుచేయడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్రేమ్‌ను దూరంగా జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామ సభలతో రైతుల సమస్యల పరిష్కారం



తిమ్మాపురం సభలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభల ద్వారా రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించిన సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయని తాహసీల్దార్ జె.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని మేజరు పంచాయతీ తిమ్మాపురం సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ అధికారులు రీ సర్వే పై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సభల్లో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేర్ రావాడ త్రిమూర్తి మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన తప్పులకు సంబంధించి 43 దరఖాస్తులు అందాయని చెప్పారు. విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నాయని 12 దరఖాస్తులు, ఆన్‌లైన్ సమస్యలపై మూడు, ఫొటోల అప్‌లోడ్ తప్పులపై 18, సర్వే నంబర్ల తప్పులపై మూడు, జాయింట్ ఎల్‌పీఎంలు విడదీయంపై రెండు, ఇతర సమస్యలకు సంబంధించి ఐదు దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, డీటీ నీరజ, వీఆర్‌వోలు నూకరాజు, గోపి, కార్యదర్శి ప్రసాద్, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.



ప్రశస్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో-2 వేమగిరి

ప్రశస్త యాప్‌పై హెచ్‌ఎంలకు అవగాహన

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంల్లజీ ఎంఈవో-1 కె.నరేశ్, ఎంఈవో-2 వేమగిరి నూకరాజు ప్రశస్త యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్ ప్రాముఖ్యత, యాప్‌లో ఏ విధంగా స్క్రీనింగ్ చేయాలనే అంశాలను వివరించారు. యాప్ లాగిన్ ఇతర అంశాలను గొడిచెర్ల హైస్కూల్ ప్రత్యేక విద్యను బోధించే షేక్ యాస్మిన్ హెచ్‌ఎంలకు తెలియజేశారు. విద్యార్థుల్లో అభ్యాసనా లోపాలను తెలుసుకోవడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

పశుగణన సమగ్ర సర్వేకు సహకరించాలి

కోటవురట్ల, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటవురట్ల పశు వైద్యశాల వద్ద పశుగణన సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాములవాక పశు వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. పశుగణన సర్వే కోసం పది మంది సిబ్బందిని, సూపర్‌వైజర్లుగా ముగ్గురు వైద్యులను నియమించడం జరిగిందన్నారు. పశుగణన నమోదు కోసం ఇంటింటికీ వచ్చే సర్వే బృందానికి సమగ్ర సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఏపీవో నాగరాజు, సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీలు పి.సూర్యరావు, వి.రాంబాబు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నేడు వేంపాడులో జిల్లా స్థాయి యోగా పోటీలు

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు జరుగుతాయని పాఠశాల హెచ్‌ఎం మూర్తిరాజు చెప్పారు. డీఈవో, ఎంఈవో, ఎస్.జీ.ఎఫ్ అధికారుల ఆదేశాల మేరకు వేంపాడు హైస్కూల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో నియోజకవర్గాల స్థాయిలో ఎంపికైన విజేతలతో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని, సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా మహాసభ రేపు

కోటవురట్ల, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం అబిడ్స్ సెంటర్ ఎన్జీవో హోమ్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని కోటవురట్ల మండల నాయకులు గంటేడ అప్పారావు, మునగాడ కొండలరావు, ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ వస్తారన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే మహాసభకు మాదిగ, రెల్లి ఉప కులాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కోటవురట్ల మండలం తంగేడు, కైలాసపట్నం టీకేపల్లి, రాజుపేట, కేవెంకటాపురం, గొట్టివాడ గ్రామాలకు చెందిన ఎమ్మార్పీ అనుబంధ సంఘాల శ్రేణులు నర్సీపట్నం సభకు వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రారంభం

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సంఘ ప్రతినిధులు ముమ్మరంగా చేపడుతున్నారు. పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోడపు వెంకట రమణ, ప్రగడ శివాజీ తదితరులు పలువురు ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులతతో ఓటరు నమోదు చేయించారు. సంబంధిత నమోదు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని చెప్పారు.

'రైతుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తా'

కోటవురట్ల, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో భూముల రీ సర్వేలో జరిగిన లోపాలపై దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరిస్తానని తహసీల్దార్ తిరుమలబాబు స్పష్టం చేశారు. శుక్రవారం కోటవురట్ల మండలం లింగాపురం సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ భూ రీసర్వే ఈ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. గతంలో రీ సర్వే చేసినప్పుడు భూమి విస్తీర్ణంలో తప్పులు, హెచ్చుతగ్గులు, యాజమాని పేరు మార్పులు, తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి అధికంగా 102 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. సభలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కోరుప్రోలు గంగారత్నం, నాయకుడు రమణ, పాల్గొన్నారు.

హిందీ భాష గొప్పది

ఎలమంచిలిలో జరిగిన జాతీయస్థాయి వెబ్‌నార్‌లో వక్తలు



డిగ్రీ కళాశాలలో జరిగిన వెబ్‌నార్‌లో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విశాలమైన భారత దేశాన్ని ఏకం చేయడంలో హిందీ భాషా సాహిత్యాలు ఎంతో దోహదం చేశాయని, ఇటువంటి భాషను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇక్కడి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'హిందీ భాషా సాహిత్యాలు- వివిధ దృక్పథాలు' అనే జాతీయస్థాయి వెబ్‌నార్‌లో మాట్లాడారు. హిందీ భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ హిందీ భాషపై పట్టు సాధిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కళాశాల హిందీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కె.సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌ఘడ్ మౌలానా ఆజాద్ ఎడ్యుకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వాతిజాజు, ఉత్తరాఖండ్ రుద్రాపూర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వసుధా ఉపాధ్యాయ, రాజస్థాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభా శర్మలతో పాటు ఎలమంచిలి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి ఆలయ అధ్యక్షుడిగా బాబులు



ఆలయ అధ్యక్షుడిగా బాబులును ప్రకటిస్తున్న సుందరపు సతీష్

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగేంద్ర కాలనీలో గల నాగేంద్రస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పూడి బాబులును నియమించినట్టు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా బాబులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సుందరపు సతీష్ కుమార్‌తో పాటు మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, పూటకూటి రమేష్, కొఠారు శ్రీను, నరేష్, నక్కా వెంకటరమణ, దాడి రమేష్ తదితరులు అభినందించారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇక్కడి పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ప్రారంభం కానుందని పట్టణ శాఖ అధ్యక్షుడు గొర్లె నానాజీ తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు సమక్షంలో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి **వివిధ శాఖల అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే 'సుందరపు'**



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇక్కడ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో మురుగు నిల్వలు లేకుండా ఎప్పటి కప్పుడు కాలువలను శుభ్రం చేయాలన్నారు. చెత్తాచెదారాన్ని తొలగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే, తాగు నీరు ప్రతి ఇంటికి అందేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం

తహసీల్దార్ శ్రీనివాసరావు



అప్పన్నపాలెం గ్రామ సభ నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు చక్కని వేదికలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొరపూడి పంచాయతీ అప్పన్నపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడారు. రీ సర్వే సందర్భంగా తలెత్తిన భూ సమస్యలను సభ దృష్టికి తేవచ్చునన్నారు. దీంతో పలువురు అర్జీలను సమర్పించారు. అందరితో ఆయన స్వంగా మాట్లాడారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపేందుకు కృషిచేస్తామన్నారు. రెవెన్యూ శాఖ పరమైన ఎటువంటి సమస్యలున్నా కార్యాలయానికి విచ్చేసి పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారుతో పాటు వీఆర్‌వో కుమార్, ప్రజా ప్రతినిధులు లాలం తాతబాబు, రుత్తల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఇన్ గేటు వద్ద తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో వాగ్వాదం జరగడంతో చేరిన ప్రయాణికులు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేటు జంక్షన్ వద్ద శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. బస్సును నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అప్రమత్తం కావడంతో ఓ బైకిస్టు క్షేమంగా బయటపడ్డాడు. అచ్యుతాపురం నుంచి ఎలమంచిలి బస్టాండ్‌లోకి వస్తున్న బస్సు వెనుక టైరు వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో ఓ వ్యక్తి వచ్చి పడిపోయాడు. ఇది గుర్తించిన డ్రైవర్ బస్సును ఒక్కసారిగా బ్రేక్ వేసి అదుపు చేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్, వాహనదారుడి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇదిలావుంటే, ఈ బస్టాండ్ జంక్షన్ ఇన్‌గేటు వద్ద, ఔట్‌గేటు వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా కొందరు వాహనదారులు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారనే వాదన వినిపిస్తోంది. దీంతో బస్సులు స్టాండ్‌లోకి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. దీనిని నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోక పోవడంతో తరచూ ఈ సమస్య ఎదురవుతోంది. వెంటనే పోలీస్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

అభిజిత్‌ను తెరిపించాలని ఆందోళన

అచ్యుతాపురంలో కార్మికులతో కలిసి సీఐటీయూ నేతలు రాస్తారోకో



అచ్యుతాపురం జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కార్మాగారాన్ని వెంటనే తెరిపించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురం జంక్షన్‌లో శుక్రవారం కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కర్మాగారాన్ని మూసివేయడంతో పాటు కార్మికులకు లేఆఫ్ విధించడం తగదన్నారు. వెయ్యిమంది కార్మికులు గత పదకొండు రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా యాజమాన్యం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కర్మాగారాన్ని తెరిపించడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందిగా ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాముతో పాటు కార్మికులు పాల్గొన్నారు.


అభయాంజనేయస్వామికి విశేష పూజలు



స్వామిని దర్శించుకుంటున్న జడ్పీటీసీ తదితరులు

రాంబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం ప్రధాన జంక్షన్‌లో కొలువుదీరిన అభయాంజనేయ ఆలయ పదకొండో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామికి పూజలు ప్రారంభమయ్యాయి. జడ్పీటీసీ దూళి నాగరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

అచ్యుతాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతపై మహిళా సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ ర్యాలీ జరిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధలను పాటించాలని నినాదాలు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, ఏసీబి రాజాన అప్పారావు, రాంబాబు, మహేష్‌తో పాటు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేవీ రోడ్డులో గుంతలు పూడ్చివేత



రాంబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేవీ ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతలను ఐటీడీ ఏషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది శుక్రవారం పూడ్చివేత పనులను చేపట్టారు. వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా వాడనర్సాపురం సమీపంలోని నేవీ గేటు వరకు రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన సదరు సంస్థ సిబ్బంది ఈ మేరకు చర్యలు చేపట్టారు. జీఎస్‌బీ మెటీరియల్‌ను తీసుకు వచ్చి ఆయా గుంతల్లో వేసి రోలింగ్ చేపట్టారు. దీంతో కొంతవరకు ఈ రోడ్డులో కష్టాలు తీరుతాయని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పూర్తిగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం

▸▸ జమాదులపాలెం, పరవాడపాలెంలో భారీ ఏర్పాట్లు


జమాదులపాలెంలో కొలువుదీరిన ఆది దంపతులు

కశింకోట, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమాదులపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో కొలువుదీరిన గౌరీపరమేశ్వరులకు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరపనున్నామన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ ఊరేగించి అనుపు చేయనున్నట్టు వివరించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

జోగారావుపేటలో అభిజిత్ కార్మికులు ఆందోళన

▸▸ కర్మాగారాన్ని తెరిపించి, లేఆఫ్‌ను ఎత్తివేయాలని నినాదాలు


జోగారావుపేటలో నినాదాలు చేస్తున్న కార్మికులు

కశింకోట, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాన్ని వెంటనే తెరిపించి, కార్మికులకు విధించి అక్రమ లేఆఫ్‌ను ఎత్తివేయాలని శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని జోగారావుపేటలో అరవై మంది అభిజిత్ కంపెనీ కార్మికులు ఉండడంతో గ్రామంలో ఈ ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం లేఆఫ్ విధించడం వల్ల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను తుంగలోకి తొక్కడం సరికాదన్నారు. సంస్థను వెంటనే తెరిపించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎం.సన్యాసిరావు, జె.శ్రీనివాసరావు, చంద్రరావు, జె.పుష్పవతి, పాపమ్మ, భూలక్ష్మి, ఎం.కుమారి, ఈశ్వరరావు, సీఐటీయూ నాయకులు సోమునాయుడు, సత్తిబాబు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

▸▸ నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

▸▸ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి లక్ష్మణ


కార్మికుల నిరసనలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించని కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన నిరసనను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ జీవో 549, కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ నెలలు తరబడి చెల్లించడం లేదన్నారు. కార్మికుల డబ్బులను వాడుకుని కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్‌లను, వారి కాంట్రాక్టు లైసెన్స్‌లను రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎస్.సంతోష్, అడ్డా ప్రసాద్, వడ్డాది పోలరావు, కొండపల్లి వరలక్ష్మి, వడ్డాది ఉమా తదితరులు పాల్గొన్నారు.


పరవాడ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

భారీ వాహనాల రాకపోకలతో అవస్థలు

▸▸ ఇబ్బందులు పడుతున్న పరవాడ గ్రామస్థులు



పరవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారి గుండా ఇటీవల కాలంలో భారీ వాహనాల రాకపోకలు అధికమైంది. ఈ కారణంగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునగపాక మండలంలోని వెంకటాపురానికి సమీపంలో గల ఆర్‌హెచ్ఐ క్లాసిల్ కంపెనీకి కావాల్సిన ముడిసరుకులు తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. రహదారికి ఆనుకుని నివాసాలు ఉండడంతో పాటు వృద్ధులు, చిన్నపిల్లలు రహదారి దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం భారీ వాహనాల రాకపోకలు కారణంగానే తరుచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ భారీ వాహనాల రాకపోకలకు అనుమతులు లేనప్పటికీ నిబంధనలను అతిక్రమించి వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే కలుగజేసుకుని పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో వాహనాలు రాకుండా తాము అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ఏడాదిగా ఇంతే.. అధికారులకు పట్టదంతే..!

▸▸ ఉడ్‌పేట యల్లయ్య కాలువ కల్వర్టుపై రాకపోకలకు భయం..భయం..

▸▸ పూడికతీతలో భాగంగా ఓవైపు తొలగించిన రక్షణ గోడ

▸▸ పనులు పూర్తయినా చేపట్టని పునర్నిర్మాణం

▸▸ తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు


ఉడ్‌పేటలోని యల్లయ్య కాలువపై ఉన్న కల్వర్టు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ఉడ్‌పేట యల్లయ్య కాలువపై తొలగించిన రక్షణ గోడ నేటికీ పునర్నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యల్లయ్య కాలువలో పూడికతీత చేపట్టే పనుల్లో భాగంగా సుమారు ఏడాది క్రితం కాలువ మధ్యలోకి సిమెంట్ గోడలపై ఎక్సకవేటర్‌ను దించేందుకు ఒక పక్క రక్షణగోడను అప్పట్లో నిర్వాహకులుతొలగించారు. పనులు పూర్తయినా నేటి వరకు తొలగించిన రక్షణ గోడ నిర్మించలేదు. దీంతో రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు.ఈ మార్గంలో రైల్వేస్టేషన్‌కు, కోట్నివీధి, లక్ష్మీనారాయణనగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఆలయాలకు వెళ్లే వారు ఎక్కువ మంది ఉన్నారు. అలాగే ఈ జంక్షన్‌లోనే ఉదయం వేళల్లో భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం వస్తుంటారు. పలు సందర్భాల్లో ఎదురుగా భారీవాహనాలు వచ్చేటప్పుడు తప్పించేందుకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటువంటి సమయంలో పలువురు వాహనచోదకులు కాలువలో పడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా అధికారుల్లో మాత్రం స్పందన లేకపోతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఓ వైపు రక్షణ గోడ లేని దృశ్యం

రాత్రి వేళల్లో బితుకు..బితుకు..

రాత్రి వేళల్లో ఈ కల్వర్టు వద్ద విద్యుత్ దీపాలు అంతగా లేకపోవడంతో చీకటి సమయంలో బితుకు బితుకుమంటూ వాహనచోదకులు రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఈ కల్వర్టుపై తొలగించిన రక్షణగోడ నిర్మించాలని ఆమ్ ఆద్మీ అనకాపల్లి ఇన్‌చార్జి కొణతాల హరినాథబాబు, బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు తదితరులు ఆందోళన చేపట్టినా ఫలితం లేకపోయింది. తక్షణమే అధికారులు స్పందించి తొలగించిన రక్షణ గోడను నిర్మించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఈ మార్గంలో ప్రయాణించే వారంతా కోరుతున్నారు.

ఈ విషయమై జీవీఎంసీ ఏఈ సుమిత్రను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, కల్వర్టుపై తొలగించిన రక్షణ గోడను త్వరలోనే నిర్మిస్తామని తెలిపారు.

స్కూల్ పిల్లలు ఇబ్బంది పడుతున్నారు



ఉడ్‌పేటలోని యల్లయ్య కాలువ కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వ్యక్తి సైకిల్‌పై వెళ్తూ కాలువలో పడిపోయారు. అదే రక్షణ గోడ ఉండి ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఈ మార్గంలో స్కూళ్లు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు ఎక్కువ మంది ఉన్నారు. తక్షణమే కల్వర్టుపై తొలగించిన రక్షణ గోడను నిర్మించాలి.

\- మహ్మద్ అలీ రజా, ఉడ్‌పేట, అనకాపల్లి

కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి



యల్లయ్యకాలువలో పూడికతీత పనుల కోసం తొలగించిన రక్షణ గోడను నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లినా ప్రయోజనం లేదు. రక్షణగోడ లేకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం విశేషం.

\- కొణతాల హరినాథబాబు, లక్ష్మీదేవిపేట, అనకాపల్లి

'సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి'


కూండ్రం పాఠశాలల్లో మాట్లాడుతున్న ఏఎస్ఐ భాస్కరరావు

కొత్తూరు, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల మోసాలపై కూండ్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సింగంపల్లి భాస్కరరావు హాజరై మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో పలు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రధానంగా యువతకు వాట్సాప్ వీడియో కాల్ చేసి మార్ఫింగ్ వీడియోలు చూపించి డబ్బులు ఇవ్వాలని, లేకుంటే వీడియోలు సోషల్ మీడియాల్లో పంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులకు వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు చేపడతామన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు పరిచయం చేసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు అడుగుతుంటారని వివరించారు. అటువంటి వారి మాటలకు యువత మోసపోవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం.కె.భాస్కరం, ఉపాధ్యాయులు ఎన్.ఎస్.రాజా, ముత్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం : రత్నాకర్



అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ శనివారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. పార్టీలో చేరాలనుకునే ప్రతి సభ్యుడు కనీసరుసుం రూ.వంద చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంతకు ముందు నమోదైనవారు తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవచ్చునన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి సభ్యుడు వారి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా రూ.ఐదు లక్షలు ప్రమాదబీమా కల్పించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లో గల పార్టీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు సభ్యత్వ నమోదు ప్రారంభం కానుందన్నారు.

పరవాడ : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఇరువాడలో గల జీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న తెలిపారు. విశాఖజిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, బూత్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన


మేళాకు హాజరైన అభ్యర్థులు

లంకెలపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెంలో గల హైటెక్ ఐటీఐలో హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్ సిస్టం లిమిటెడ్ కంపెనీ శుక్రవారం ఏర్పాటు చేసిన అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. ఐటీఐలో పెయింటర్, ఫిట్టర్, మెషినిస్ట్ ట్రేడుల్లో ఉత్తీర్ణత పొందిన 117 మంది అభ్యర్థులు మేళాకు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ విభాగం ప్రతినిధులు శ్రీనాథ్, కార్తికేయ, ప్రేమ్‌కుమార్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి త్వరలో సమాచారం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అక్కిరెడ్డి దుర్గినాయుడు, నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ బృందగాన పోటీలకు డీఏవీ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఆదివారం జరగనున్న భారత్ వికాస్ పరిషత్ జాతీయ బృందగాన పోటీలకు డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రాజమండ్రిలో ఈనెల 20వ తేదీన భారత్ వికాస్ పరిషత్ ప్రాంతం తరపు పోటీల్లో సదరు విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పరిషత్ ప్రతినిధి ఆళ్ల ఓంరామ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరిషత్ ప్రతినిధులు ఏబీ వర్మ, డి.శివరామ్, జి.లక్ష్మీనారాయణతో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.

'ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి'


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ శేఖరం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మోటార్ వాహన చట్టం నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం సూచించారు. ఇక్కడి నారాయణ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు లైసెన్సు, ఇతర రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనంపై వెళ్లేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే సైబర్ నేరాలపై కూడా ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, టాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన వారిపై ఫిర్యాదు


ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలు

సబ్బవరం, అక్టోబరు 25 : మండలంలోని లగిశెట్టిపాలెం సర్వే నెంబరు 91లో గల ప్రభుత్వ భూమి సుమారు రెండు ఎకరాల్లో దౌర్జన్యంగా మామిడి మొక్కలు నాటిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన గొర్లి దేముడుబాబు శుక్రవారం తహసీల్దార్ చిన్నికృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి సదరు ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇటీవల పాతరపల్లి వెంకటరమణ అనే వ్యక్తి తమ సాగులో ఉన్న భూమిలోకి చొరబడి ఎవరూ లేని సమయంలో మామిడి మొక్కలునాటడమే కాకుండా తొలగించిన వారు శిక్షార్హులంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై వీఆర్వో అప్పలరాజు, వీఆర్ఏ నర్సింగరావుకు సమాచారం ఇవ్వగా వారు ఆ హెచ్చరిక బోర్డును తొలగించారన్నారు. మామిడి మొక్కలు కూడా తొలగించాల్సిందిగా ఆయన కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ లగిశెట్టిపాలెం సర్వే నెంబరు 91లో 8.74 ఎకరాలు గయాళు, ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మామిడి మొక్కలు తొలగిస్తామన్నారు. విచారణ జరిపి ఎవరికైనా డి.పట్టా ఇవ్వకుంటే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దేముడుబాబు

'మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు'



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సూచించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చిత్తుగా మారుతుందన్నారు. యువత సన్మార్గంలో నడిచి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎం.గోవిందరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగస్థుల ఆటల పోటీలకు ఎంపికలు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ పురుషులు, స్త్రీ ఉద్యోగస్థులకు 18 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఈనెల 29, 30వ తేదీల్లో జరగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ శుక్రవారం తెలిపారు. ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియం, కలెక్టర్ కార్యాలయ వద్ద గల గ్రౌండ్, చిన హైస్కూల్, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, డీసీఎంఎస్ గ్రౌండ్, జార్జిక్లబ్‌లలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో వచ్చే నెల ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు జరిగే ఎంపికకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడల పోటీల్లో పాల్గొంటారన్నారు. అర్హులైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగస్థులు తమకు సంబంధించిన గుర్తింపు ధ్రువ పత్రాలతో తమ పేరును జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, అనకాపల్లిలో నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. పూర్తి వివరాలకు పీవీ నాగేశ్వరరావు, హ్యాండ్‌బాల్ కోచ్ 73828 41568, జి.రాం బాబు, హాకీ కోచ్ 98855 30819 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

'రెవెన్యూ గ్రామ సభల్లో భూ సమస్యలకు పరిష్కారం'


లగిశెట్టిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

సబ్బవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లగిశెట్టిపాలెంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి సభలు దోహదపడతాయన్నారు. అనంతరం గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. 59 మంది తమ భూములకు సంబంధించిన సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రూన్సీలక్ష్మీరాణి, డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్, గ్రామ పెద్దలు సురేష్‌రాజ్, ఆడారి నాగరాజు, శరగడం రాము, బంగారయ్య, వెంకట్, ఫల్గుణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పి.బోనంగిలో...

పరవాడ : మండలంలోని పి.బోనంగిలో శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామసభ కొనసాగుతుందన్నారు. రైతులంతా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

సినిమాహాల్ కూడలిలో పగలూ వెలుగులే!



పరవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పర వాడ సినిమా హాల్ కూడలిలో గల ఎల్ఈడీ లైటు గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన ఈ లైటు పట్టపగలు సైతం వెలుగులు విరజిమ్ముతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. విద్యుత్ పొదుపుపై పదేపదే అవగాహన కల్పించే సదరు అధికారులు ఇలా విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

సమగ్ర సమాచార సేకరణకే పశుగణన

» పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసు

నాతవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు సంపదపై సమగ్ర సమాచారాన్ని సేకరించడానికే పశుగణన కార్యక్రమాన్ని చేపడుతున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసు తెలిపారు. మండలంలోని ఏపీపురం, శృంగవరం గ్రామాలలో స్థానిక రైతులతో కలసి శుక్రవారం పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. పశుగణనలో 16 రకాల పశుజాతులను గుర్తిస్తామన్నారు. దీనివల్ల ఏ రైతు వద్ద ఎన్ని పశువులు ఉన్నాయో తెలుస్తుందని, అలాగే పాల ఉత్పత్తి ఎంత ఉంటుందన్న సమాచారం వస్తుందని చెప్పారు. అలాగే వచ్చే బడ్జెట్‌లో పశువుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత కేటాయించాలన్నది కూడా తెలుస్తుందన్నారు. పశుగణనకు వచ్చే అధికారులకు రైతులు సరైన సమాచారాన్ని ఇవ్వాలని ఏడీ కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మోక్షరెడ్డి, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.


పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ శ్రీనివాసు, సిబ్బంది


పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పశుగణనను జయప్రదం చేయండి

మాకవరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే పశుగణన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పశు వైద్యాధికారి అనిల్ ప్రదీప్ కోరారు. మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం వద్ద శుక్రవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం ద్వారా మండలంలో ఎన్ని పశువులు ఉన్నాయనే విషయం తెలుస్తుందన్నారు. అలాగే వాటి అనుబంధ సమాచారం కూడా సేకరిస్తామన్నారు. ఇది ప్రజా సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి: చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి సూచించారు. నర్సీపట్నంలో శుక్రవారం అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా ఒక రోజు బహిరంగ మార్కెట్ నిర్వహించేందుకుగాను చర్యలు చేపట్టామన్నారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ మట్టి బొమ్మలు, వస్త్రాలు, తినుబండారాలు, ఫ్యాన్సీ తదితర 56 రకాల యూనిట్ల అమ్మకాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ వరలక్ష్మి, రీసోర్సుపర్సన్ రమాదేవి పాల్గొన్నారు.


ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

రీ సర్వే ఫిర్యాదులపై విచారణ

గొలుగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల, పొలవరం, ఎరకంపేట రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వేలో తప్పులు సవరించేందుకు గ్రామ సభలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో సుమారు వివిధ రకాలైన సమస్యలపై 62 ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది భూములను పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో రాజు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు



నాగాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్ర రావు సూచించారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట సిహెచ్.నాగాపురం ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై శుక్ర వారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రక్తహీనతతో ఉన్న వారికి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించారు. అలాగే వైద్య సేవలపై సిబ్బంది, రోగులను ఆడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో రామచంద్రరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు చేరువయ్యేలా తనిఖీలు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. మతాశిశు మరణాలు తగ్గించటమే లక్ష్యంగా బృందాలతో తనిఖీలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డేటా మేనేజర్ జనార్దన్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.హరిప్రవీణ్, వైద్య సిబ్బంది సావిత్రి, బీవీ సత్యనారాయణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నంలో పోలీసుల విస్తృత తనిఖీలు



ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో నార్కొటిక్ డాగ్ స్క్వాడ్‌తో ఈ తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, పార్సిల్ కార్యాలయం, బస్సులతో పాటు ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తు పదార్థాలు రవాణా జరుగుతుందన్న అనుమానంతో ఈ తనిఖీలు చేపడుతున్నట్టు సీఐ గోవిందరావు తెలిపారు. గంజాయి గురించి సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వర రావు చెప్పారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా బాలబాలికల వాలీ బాల్ క్రీడాకారుల ఎంపికల కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ లోచల సుజాత ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. కాగా ఈ ఎంపిక పోటీల్లో అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని 16 నియోజకవర్గాల నుంచి 32 టీముల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆటలపోటీలను సర్పంచ్ లోచల సుజాత చేతుల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు చింతల బుల్లిప్రసాద్, పీడీలు టీవీ రమణ, మాధవి, నూకరాజు, నరసింగరావు, పీఈటీలు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో పారిశుధ్య పనులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



ఏఎల్ పురంలో కాలువల్లో చెత్త తొలగిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ నెల 20వ తేదీన 'మురుగు కదలదు.. కంపు వదలదు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి స్పందించారు. డీపీవో ఆదేశాల మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్, సర్పంచ్ లోచల సుజాత ఏఎల్ పురంలో దగ్గరుండి పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించి పరసరాలు పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాల్సి అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి సూచించారు. రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రంలో శుక్రవారం ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. పొలంబడి కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల వ్యవసాయాధికారులు అప్పారావు, విజయ లక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ యువజన నాయకుడిపై దాడి

» పోలీసులకు పార్టీ శ్రేణుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రొంగలి శంకర్ గిరిపై కొందరు వ్యక్తుల దాడి చేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడుకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు శంకర్ గిరి మాట్లాడుతూ బుధవారం రాత్రి రాచపల్లి నుంచి జంగాలపల్లి బంధువుల ఇంటికి వెళ్లానన్నారు. అయితే అదే రోజు రాత్రి రాచపల్లి సెంటరులోని మామిడి తోట నుంచి లాలం దుర్గారావుతోపాటు మరో కొందరు వ్యక్తులు పలు మార్లు తనకు ఫోన్ చేశారన్నారు. మాట్లాడే పని ఉందని ఒత్తిడి చేయడంతో రాత్రి పది గంటల సమయంలో వారి వద్దకు వెళ్లానన్నారు. అయితే రాచపల్లికి చెందిన నటరాజన్‌తో గొడవలు ఎందుకు వస్తున్నాయని, మీరిద్దరూ కలిసిపోవాలన్నారు. అతనితో కలిసేది లేదని తాను చెప్పడంతో వారి చేతిలో ఉన్న మద్యం బాటిల్ తలపై బలంగా కొట్టడంతో అక్కడిక్కడ కింద పడిపోయినట్టు చెప్పారు. తర్వాత వారు తన బైకును తీసుకొని పరారీ అయ్యారని శంకర్ గిరి చెప్పారు. తోటలో పక్కనే ఉన్న గోవింద ఆవులకు గడ్డి వేసేందుకు బయటకు రావడంతో కింద పడిపోయిన తనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. దాడి చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు పాశపు సురేష్, జోగిపాత్రుడు, రుత్తల జమీందార్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



పల్లంవలసలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఏవీవీ.కుమార్

అనంతగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ పల్లంవలసలో పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీలో లోపాన్ని గుర్తించి, అంగన్‌వాడీ కార్యకర్తను మందలించారు. ఈ కార్యక్రమంలోని ఈవోపీఆర్డీ లాలం సీతయ్య, హౌసింగ్ సిబ్బంది నాగేశ్వరరావు, టీడీపీ నాయకులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పెయింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అరకులోయ, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి: అరకులోయ సీ. కాలనీకి చెందిన కొర్రారాజు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన కుటుంబానికి స్థానిక తేజావలి పెయింటర్స్ అసోసియేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రూ.10 వేలు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావుఅసోసియేషన్ అధ్యక్షుడు కొండలరావు, కార్యదర్శి రాములు, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మృతిచెందిన శ్రీను సీఐటీయూ భవన నిర్మాణరంగంలో చురుగ్గా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సభ్యులు వీర్రాజు, సుధా, అప్పారావు పాల్గొన్నారు.

తంగేడు దుంగలు స్వాధీనం

కొయ్యూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ ఉంచిన 74 తంగేడు దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు పెదవలస అటవీ రేంజ్ అధికారి శివరంజిని తెలిపారు. మండలంలో శుక్రవారం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా దొడ్డవరం శివారున రహస్య ప్రాంతంలో నిల్వ చేసిన ఈ దుంగలు పట్టుబడినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.17 వేల వరకు ఉంటుందని అంచనావేశారు. ఈ దుంగలను కాకరపాడు డిపోకు తరలించినట్టు ఆమె తెలిపారు.

విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

జి.మాడుగుల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని ఆశ్రమ విద్యార్థినులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి శశికాంత్ తెలిపారు. మొత్తంగా 482 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, పదిమందికి కళ్లద్దాలకు సిఫార్సు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎన్. ప్రకాశ్, జ్యోతిలాల్ పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశు గణన పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈనెల 25న నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు గణన ప్రక్రియను పక్కాగా చేపట్టి రైతులకు మేలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శార్యమన్, డీఆర్‌వో పద్మావతి, పశు సంవర్థక శాఖ డీడీ నరిసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులను ఎత్తుకొని నెత్తిపై మూటలతో సంతకు వెళ్తున్న మహిళలు



కాలిబాటలో ప్రయాణం

గిరిపుత్రులకు ఎంత కష్టం..

- రహదారి సౌకర్యానికి దూరంగా మసిపుట్టుగ
- కొండలపైనుంచి అటవీ ఉత్పత్తుల తరలింపు
- ఆదివాసీ మహిళల శ్రమ వర్ణనాతీతం

ఆదివాసీల కష్టాలకు ఈ చిత్రాలు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి. తమ గ్రామానికి రహదారి సౌకర్యంలేక మసిపుట్టుగకు చెందిన మహిళలు ఒడిలో చంటిబిడ్డ, నెత్తిన పంట ఉత్పత్తులతో కిలో మీటర్ల దూరం ప్రయాణం సాగిస్తున్నారు. ఈ స్థితిలో ఇప్పటి వరకు ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు గిరిజనులకు ఏ మేరకు చేరాయన్నది భేతాళ ప్రశ్నగా వెక్కిరిస్తోంది.

పాడేరురూరల్, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి: కొండలపై రాళ్ల, గుట్టలను దాటుకుంటూ గిరిజన మహిళలు ప్రయాణిస్తున్న దృశ్యం డోకులూరు పంచాయతీ మసిపుట్టు పీవీటీజీ గ్రామ శివారులోనిది. శుక్రవారం గ్రామస్థులు గుత్తులపుట్టు సంతకు ఇలా ప్రయాణం సాగించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో పంటలను ప్రతి వారం ఇలా మోసుకుంటూ వెళ్లి విక్రయించాల్సి వస్తోందని వారు వాపోయారు. అత్యవసర సమయంలో రోగులను ఆస్పత్రికి తరలించాలన్నా కాలినడకన తీసుకువెళ్లక తప్పడంలేదని లేదని గ్రామానికి చెందినసత్తిబాబు, సూరిబాబు, చిట్టిబాబు, నాగేశ్వరరావు, కాంతమ్మ, రాధమ్మ, డెమో, సింద్రి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పీఎం జన్మన్ నిధులు విడుదల చేసినా, తమ పంచాయతీ సచివాలయ కనీస చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో పండించిన అపరాలు, పంటలను నెత్తిన పెట్టుకొని సంతలకు కాలినడకన తరలించి అమ్మకాలు చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. నిత్యావసరాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుత్తులపుట్టు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఆశ్రమాల్లో హెల్త్ వలంటీర్ల నియామకానికి కృషి



కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రమిస్తున్న వలంటీర్లు

పాడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లోని హెల్త్ వలంటీర్ల నియామకానికి కృషి చేస్తామని టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బాధిత వలంటీర్లు శుక్రవారం ఇక్కడ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఆశ్రమ పాఠశాలల్లో వలంటీర్లులేక గిరిజన విద్యార్థుల బాగోగులు చూసుకునేవారు కరువయ్యారని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శ్రావణ్‌కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి సాగర సుబ్బారావు, దారెల సర్పంచ్ పాండురంగస్వామి పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయాలి

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న గురుకుల, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయాలని కోరుతూ, వారు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్‌తో కలిసి శుక్రవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ..పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకుల, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారిని 2025 జనవరి నెల నుంచి రెన్యూవల్ చేయాలని, ప్రస్తుతం బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డుల అధ్యక్షురాలు ఎం. ప్రశాంతి, కె.నాగమణి, కె.మమత, ఎం.సింహాచలం, పి.రాజేశ్వరి, ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

చురుగ్గా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు



జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాడేరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతోంది. జిల్లా, మండల శాఖ సభ్యులు శుక్రవారం మండలంలోని కందమామిడి టీడబ్ల్యూఏహెచ్ బాలికల పాఠశాల, మోదాపుట్టు బాలుర పాఠశాల, పాడేరు కేజీబీవీ, ఏపీఆర్ జూనియర్ బాలికల కళాశాల, పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఓట్ల నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.జగన్మోహన్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సోంబాబు, ఎస్.శాంతకుమారి, పాడేరు మండల అధ్యక్షులు కె.పోతురాజు, ప్రధాన కార్యదర్శి వి.బైరవమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా శ్రీనివాసరావు



ఏపీఎం శ్రీనివాసరావు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వెలుగు ఏపీఎంగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న నాయుడు పాయకరావుపేట బదిలీ కాగా, అతని స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో పనిచేస్తున్న శ్రీనివాసరావుని నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

2 వేల టన్నుల కాఫీ పండ్లు కొనుగోలు లక్ష్యం

- ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన అధికారులు

పాడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 2 వేల టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించినట్టు ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడించారు. కాఫీ పండ్ల కొనుగోలుపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపూర్ణంగా పండిన కాఫీ పండ్లను మాత్రమే రైతులు సేకరించేలా అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైనవి మాత్రమే కొనుగోలుచేయాలని, మాక్స్ సంస్థ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని, నష్టం వాటిల్లితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. అలాగే జీసీసీ ద్వారా అరబికా పార్చిమెంట్ కాఫీని కిలో రూ.285, అరబికా చెర్రీ కిలో రూ.150లు, రొబస్టా కిలో రూ.80లకు కొనుగోలు చేస్తారన్నారు. చింతపల్లి మ్యాక్స్ సంస్థ ద్వారా కిలో రూ. 44 చొప్పున కాఫీ పండ్లను కొనుగోలు చేస్తామన్నారు. వాటి విక్రయాల అనంతరం రైతులకు బోనస్ చెల్లిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం జి.మాడుగుల, జీకేవీధిలో పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు చేయనుందన్నారు. కాఫీ పండ్లు కొనుగోలులో సమస్యలుంటే ఐటీడీఏలో కాల్ సెంటర్: 08935 250833, జీసీసీ కాల్ సెంటర్: 70130 70990లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డీడీ ఎస్. రమేశ్, ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ ఎన్. అశోక్, పాడేరు, చింతలిపల్లి జీసీసీ డీఎంలు డి.సింహాచలం, దేవరాజ్, ఐటీడీఏ కాఫీ, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం: ఎస్పీ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాలలందరికీ తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండేలా చూడాలని ఎస్పీ అమిత్‌బర్ధార్ అన్నారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం పొందుతారన్నారు. చట్టాలపై అవగాహనతో అసాంఘిక కార్య కలాపాలకు దూరంగా ఉంటారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ



చెక్‌ను అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరుల

పాడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయ సంఘాలకు స్త్రీ నిధి రుణాల్లో భాగంగా రూ.39 లక్షలను పంపిణీ చేశారు. కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం మెగా చెక్‌ను మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఆయా రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈసందర్భంగా ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శార్యమన్, డీఆర్‌వో బి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేం: సీఐ



మావోయిస్టుల చేతిలో అమరుడైన హెచ్‌సీ అప్పన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ దీనబంధు

పాడేరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మణీయమని స్థానిక సీఐ డి. దీనబంధు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాల్లో భాగంగా స్థానిక సీఐ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించా రు. మావోయిస్టుల చేతిలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.అప్పన్న, కానిస్టేబుల్ డి.శివలింగం ఇళ్లకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అమరుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

జి.మాడుగుల: పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఈ నెల 21 నుంచి 31వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జి. మాడుగులలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు

ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపు: ఏఈ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ రమణబాబు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్టు స్థానిక హౌసింగ్ ఏఈ కె. రమణ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తమ్మంగులపంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో జన్‌మన్ పక్కా గృహాలకు ఎంపీడీవో పి. ఆశాజ్యోతితో కలిసి ఏఈ మార్కింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో మండలానికి 2,665 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39లక్షల నిధులు మంజూరు కానున్నట్టు చెప్పారు. గతంలో అర్ధంతరంగా నిలిచిపోయిన గృహాల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందన్నారు. 2016-20 వరకు ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం ద్వారా మంజూరైన 813పక్కా గృహాలు, గ్రామీణ్ పథకం ద్వారా మంజూరైన 105 గృహాలు ప్రభుత్వం రూ.2.25 లక్షలు, 2021-22లో మంజూరైన 2,042 పక్కా గృహాలకు రూ.1.80లక్షలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అసంపూర్తిగా నిలిచిన ప్రతి ఇంటినీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని ఈసందర్భంగా సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు

సీలేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు క్రమంగా తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, పారామెడికల్ ఉద్యోగులతో హెడ్‌కౌంట్ సర్వే ఆఫ్ రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా టీకాలు వేయించాలన్నారు. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి, వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే, ఎట్టి పరిస్థితుల్లో నాటు వైద్యం, పసర మందులు పట్టరాదన్నారు. ఈ వైద్యం వల్ల చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం కలుగుతుందన్నారు. వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శుక్రవారం వాతావరణ సమాచారాన్ని ఆయన ప్రకటించారు. ఈనెల 30తేదీ వరకు పాడేరు, అరకువేలి, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా మూడు మిల్లీ మీటర్లు.. గరిష్ఠంగా ఐదు మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదమవుతుందని పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు జయప్రదం చేయాలి

- పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం లోతుగెడ్డ జంక్షన్‌లో కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు పిలుపు మేరకు శనివారం పాడేరు జిల్లా కేంద్రం కుమ్మరిపుట్టు వద్ద నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి నాయకత్వంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలోనూ పార్టీ అభిమానులందరినీ సభ్యులుగా చేర్పించాలన్నారు. సభ్యత్వం ఉన్నవారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు పాంగి రాము, రీమల పౌలు భీమన్న, రమణ, మహేశ్, సురేశ్, శ్రీను, రాజబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు సూర్యకాంతం పిలుపు నిచ్చారు. శుక్రవారం తమ నివాసం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడారు. శనివారం నుంచి నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదులో పార్టీ సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొవాలన్నారు. హుకుంపేట నుంచి భారీ నమోదుకు అందరి సహకారంతో కృషి చేయాలని కోరారు.

డుంబ్రిగుడ: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలని ఆ పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామానికి వెళ్లి ఈ కార్య క్రమం చేపట్టాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పాడేరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు సంయుక్తంగా శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ, పాడేరులో ప్లాస్టిక్ వాడకం నిషేధానికి కృషి చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి పిలుపునిచ్చారు. పాడేరు అంబేడ్కర్ కూడలి నుంచి ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రధానరహదారి, మైదానంలో చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్. రమేశ్, టీడీపీ నాయకులు కొట్టగుల్లి సుబ్బారావు, వైఎస్ఎంపీపీ గంగపూజారి శివకుమార్,అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచాలి: డీఎంహెచ్‌వో

మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్య సిబ్బంది తమ పరిధిలో ఉన్న సబ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, వైద్య సిబ్బంది వి.వరలక్ష్మి, సరోజిని, ఝాన్సీరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్ అన్నారు.రావణాపల్లిలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే- ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కిముడు కల్యాణం సూచించారు. జి.మాడుగుల గ్రామం పాత ఎమ్మార్వో కాలనీ తీగలమెట్ట వీధిలో తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ రామ్‌శంకర్, కార్యక్రమంలో టీడీపీ నాయకులు మత్స్యరాస మత్స్యరాజు, రీమలి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శు భ్రం చేస్తున్న పెదబయలు ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు: స్థానిక ప్రధాన కూడలి, వ్యాపార సముదాయాలలో ఎంపిడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో పంచాయితీ సిబ్బంది, అధికారులు కలసి శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీలో డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరిసరాల్లో కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ బొంజుబాబు, గంగాధరం,జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితంగా ఉంటామని, ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అన్నారు.. మండలంలోని కాశీపట్నం వద్ద ఫ్రైడే డ్రైడేలో భాగంగా సచివాలయం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలోని ఈవోపీఆర్డీ లాలం సీతయ్య, వైద్యాధికారిని జ్ఞానేశ్వరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మినుములూరు పీహెచ్‌సీ ఆవరణలో చేపట్టిన శ్రమదానంలో డీఎంహెచ్‌వో జమీల్ బాషా, వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రమదానం చేశారు. పలు చోట్ల రహదారుల ఇరువైపుల పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తను ఏరివేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పరిసరాలను శుభ్రతతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చునని అరకు పంచాయతీ సర్పంచ్ శారద అన్నారు. అరకు పంచాయతీ కేంద్రంతోపాటు డుంబ్రిగుడ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు సిబ్బందితోపాటు సోవ్వా సచివాలయ కేంద్రంలో స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. అరకులో మురుగు కాలువలతోపాటు డుంబ్రిగుడ పీహెచ్‌సీ ఆవరణను శుభ్రంచేశారు ఈకార్యక్రమంలో అరకు పంచాయతీ సెక్రెటరి వల్లిభాయ్, సచావాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

పంచాయతీరాజ్ ఈఈ వీరంనాయుడు



చోడవరంలో ఇంజనీరింగ్ పనులు పరిశీలిస్తున్న ఈఈ వీరంనాయుడు

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పల్లె పండగ, ఇతర పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ కె.వీరంనాయుడు అధికారులకు ఆదేశించారు. మండలంలోని గజపతి నగరం, జుత్తాడ, సింహాద్రిపురం, అంభేరుపురం తదితర గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికంగా చేపట్టిన ఇంజినీరింగ్ పనులు, డ్రైనేజీలు, సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ లక్ష్యం మేరకు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. మండలంలో మంజూరైన పనులు, ప్రస్తుతం వాటి ప్రగతిని పంచాయతీరాజ్ శాఖ డీఈ జీఎస్ఎస్ ప్రసాద్ ఈఈకి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ శాంతారాం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన అవసరం

జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ



వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న నందాజీ

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అయోడిన ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీవీబీ నందాజీ చెప్పారు. అయోడిన్ లోపరహిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోప వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి వారం రోజుల పాటు అయోడిన్ ఉప్పు వాడకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాధారణ ఉప్పు కంటే అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అర్థమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ కంట్రోలర్ అధికారులు బి.రవికుమార్, ఎన్.శ్రీజ, న్యూట్రిషన్ కన్సల్‌టెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు పసుమర్తి వెంకట్, ఉప్పల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాల లక్ష్యాలను చేరుకోవాలి

డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో లక్ష్యాలను ఈ నెలాఖరులోగా చేరుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు చల్లా సత్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక గౌరీ కల్యాణ మండపంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు అధ్యక్షతన కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందకుపైగా సభ్యత్వాలతో ఇప్పటికే 30 మంది కొంతమేర లక్ష్యాలను సాధించినట్టు చెప్పారు. ఐదు వేలకు పైగా సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని, ఇంటింటికీ తిరిగి ఆన్‌లైన్ సభ్యత్వాలను చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనపరెడ్డి సూర్యనారాయణ, వర్రి వెంకటరావు, పైలా అమ్మాజీ, శరగడం సన్యాసినాయుడు, ఇమంది సన్యాసిరావు, కుమార్ అప్పారావు, బండారు శ్రీరామ్మూర్తి, సూర్య రొంగలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్
జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు



నాగాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు సూచించారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట సిహెచ్.నాగాపురం ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రక్తహీనతతో ఉన్న వారికి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించారు. అలాగే వైద్య సేవలపై సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో రామచంద్రరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు చేరువయ్యేలా తనిఖీలు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. మతాశిశు మరణాలు తగ్గించటమే లక్ష్యంగా బృందాలతో తనిఖీలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డేటా మేనేజర్ జనార్దన్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.హరిప్రవీణ్, వైద్య సిబ్బంది సావిత్రి, బీవీ సత్యనారాయణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు చెప్పారు. గొలుగొండ మండలం ఏఎల్ పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా బాల బాలికల వాలీబాల్ క్రీడాకారుల ఎంపికల కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ లోచల సుజాత ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. కాగా ఈ ఎంపిక పోటీల్లో అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని 16 నియోజకవర్గాల నుంచి 32 టీముల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆటలపోటీలను సర్పంచ్ లోచల సుజాత చేతుల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు చింతల బుల్లిప్రసాద్, పీడీలు టీవీ రమణ, మాధవి, నూకరాజు, నరసింగరావు, పీఈటీలు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో పారిశుధ్య పనులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



ఏఎల్ పురంలో కాలువల్లో చెత్త తొలగిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ నెల 20వ తేదీన 'మురుగు కదలదు.. కంపు వదలదు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి స్పందించారు. డీపీవో ఆదేశాల మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్, సర్పంచ్ లోచల సుజాత ఏఎల్ పురంలో దగ్గరుండి పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించి పరసరాలు పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాల్సి అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి సూచించారు. రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రంలో శుక్రవారం ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. పొలంబడి కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అప్పారావు, విజయలక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం.. ఆహ్లాదకరం

కార్యాలయం చుట్టూ పండ్ల మొక్కలు
వాహనాల నిలుపుదలకు ప్రత్యేక షెడ్లు
పచ్చదనంతో అర్జీదారుల ఆనందం





ఎంపీడీవో కార్యాలయం పక్కనే పండ్ల తోటలు... కార్యాలయాన్ని ఆనుకుని మామిడి చెట్లు

చీడికాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆహ్లాదకరంగా కనిపిస్తున్నది. కార్యాలయం చుట్టూ పండ్ల మొక్కలు, నీడనిచ్చే పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. వర్షానికి తడవకుండా, ఎండకు ఎండిపోకుండా ఉండేందుకు కార్యాలయం ముందు వాహనాల నిలుపుదల కోసం షెడ్డు కూడా ఉంది. కార్యాలయానికి వచ్చే వివిధ శాఖల ఉద్యోగులతో పాటు పలు పనులపై వచ్చే అర్జీదారులు సైతం తమ వాహనాలను షెడ్డులో నిలుపుతున్నారు. అలాగే వర్షం కురిసినపుడల్లా ఇబ్బందులు పడకుండా అర్జీదారులు షెడ్డులో తలదాచుకొంటున్నారు. వేసవి కాలంలో చెట్లు కింద సేద తీరుతూ ఆనందంగా గడుపుతున్నారు.

ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నెల రోజులుగా ప్రతీ వారం కార్యాలయం స్వచ్ఛతసేవ కార్యక్రమానికి ఉద్యోగులంతా శ్రమదానం చేస్తున్నారని, దీంతో పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

సమగ్ర సమాచార సేకరణకే పశుగణన

పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసు



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ శ్రీనివాసు, సిబ్బంది

నాతవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు సంపదపై సమగ్ర సమాచారాన్ని సేకరించడానికే పశుగణన కార్యక్రమాన్ని చేపడుతున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసు తెలిపారు. మండలంలోని ఏపీపురం, శృంగవరం గ్రామాలలో స్థానిక రైతులతో కలసి శుక్రవారం పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. పశుగణనలో 16 రకాల పశుజాతులను గుర్తిస్తామన్నారు. దీనివల్ల ఏ రైతు వద్ద ఎన్ని పశువులు ఉన్నాయో తెలుస్తుందని, అలాగే పాల ఉత్పత్తి ఎంత ఉంటుందన్న సమాచారం వస్తుందని చెప్పారు. అలాగే వచ్చే బడ్జెట్‌లో పశువుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత కేటాయించాలన్నది కూడా తెలుస్తుందన్నారు. పశుగణనకు వచ్చే అధికారులకు రైతులు సరైన సమాచారాన్ని ఇవ్వాలని ఏడీ కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మోక్షరెడ్డి, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు గంధవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం గంధవరం గ్రామంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్ తెలిపారు. సభ్యత్వ రుసుము రూ.100 చెల్లించాలని, సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కూడా ఉంటుందని చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు విజయవంతం చేయాలని గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

గ్రామసభల్లో వినతుల వెల్లువ

బుచ్చెయ్యపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరిచేయాలంటూ శుక్రవారం పొట్టిదొరపాలెంలో జరిగిన గ్రామ రెవెన్యూ సభలో వినతులను వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ రీసర్వేలో తప్పులను సరిదిద్దే అవకాశాన్ని రీసర్వే జరిగిన గ్రామాలకు చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విరోధ యశోధ, ఆర్ఐ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత శ్రీనివాసరావు మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఎస్. శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం మృతి చెందారు. టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజుతో పాటు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయితీపై అందిచే వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూక్ష్మ నీటి ప్రాంతీయ అధికారి (ఎంఐఏఓ) ఎన్.సతీష్ కోరారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలు కలిగిన రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 నుంచి 12.5 ఎకరాల భూమి కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామన్నారు. స్ప్రింక్లర్లకు 5 ఎకరాలు లోబడి కలిగిన రైతులకు 55 శాతం సబ్సిడీ, ఐదు ఎకరాల పైబడిన రైతులకు 45 శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ కోసం రైతులు ఆధార్‌కార్డు, 10 అండగల్, బ్యాంకు పాసు పుస్తకం జెరాక్సులతో పాటు రైతు ఫోన్ నంబరు అందించాలన్నారు. అనకాపల్లి జిల్లాకు ఫినోలెక్స్, సిగ్నెట్, కొఠారి, నెటాఫిమ్, జైన్, డ్రిఫ్ ఇండియా, సుధాకర్ కంపెనీలను కేటాయించారని, రైతులకు తమకు నచ్చిన కంపెనీలను ఎంచుకోవచ్చునని సతీష్ తెలిపారు.

ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు

చీడికాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో మూడు ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతులకు రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఆ శాఖ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. అప్పలరాజుపురం నుంచి కోనాం వెళ్లే రహదారి మరమ్మతు పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అప్పలరాజుపురం నుండి కోనాం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.21 లక్షలు, చీడికాడ నుండి తురువోలు వరకూ రూ.11 లక్షలు, దేవరాపల్లి మండలం వాకపల్లి నుంచి తెనుగుపూడి వరకు రూ.18 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయనున్నామని ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

చీడికాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

పార్టీ మండల అధ్యక్షుడు
అద్దెపల్లి జగ్గారావు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారావు

మాడుగుల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం టీడీపీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి రెండేళ్ల కాలం తీసుకున్న సభ్యత్వం పనిచేస్తుందన్నారు. ప్రతీ కార్యకర్తకు రెండేళ్లలో ప్రమాదం జరిగితే బీమా వస్తుందన్నారు. అలాగే సహజ మరణానికి మట్టి ఖర్చుల కింద పది వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు వడ్డాది రంజితత్‌వర్మ, నాయకులు పప్పాల రమేష్, లెక్కల కాశిబాబు, మరువాడ ఈశ్వర్రావు, డిల్లీ నానాజీ, సూర్యనారాయణరాజు, వడ్డే రాజ్ కుమార్, నందారపు సన్యాసిరావు, పల్లెల రాము, మండలంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి



పనసలపాడు సదస్సులో డీటీకి సమస్యలు విన్నవిస్తున్న రైతులు

రోలుగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పనసలపాడులో గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం పనసలపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలు అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ అండతో సాగులో ఉన్న గిరిజనులకు తహసీల్దార్ అన్యాయం చేశారన్నారు. సాగులో లేని వారికి పట్టాలు ఇచ్చారని, దీనిపై గతంలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో క్షేత్ర పరిశీలన చేసి రికార్డులు లేకుండా ఇచ్చిన పాసు పుస్తకాలను డిస్ప్యూట్‌లో పెట్టారన్నారు. దీనిపై ఆర్డీవో కోర్టులో కేసు కూడా వేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు కోరారు.

పాల సేకరణ ధరలు పెంచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

దేవరాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరలను వెంటనే పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన నిత్యావసర ధరలు తగ్గించాలని, తగ్గిన పాల ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. ఇవచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా



బంగారమ్మపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

ఎస్.రాయవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా చెప్పారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంతో పాటు స్థానిక ఎన్ఏవోబీ ప్రాంతాలను శుక్రవారం సాయంత్రం ఎస్పీ సందర్శించారు. ఎన్ఏవోబీ నిర్మాణ పనులు, మత్స్యకారుల సమస్యలకు సంబంధించిన విషయాలపై ఆయా ప్రాంతాలకు వెళ్లి ఎస్పీ పరిశీలించారు. అనంతరం పలు విషయాలపై అక్కడి నేవీ అధికారులతో చర్చించారు. తిరిగి వెళ్తుండగా కొంత మంది విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ ఇక్కడి మత్స్యకారుల చేపల వేటకు సంబంధించిన సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే మార్గాల గురించి చర్చిండం జరిగిందన్నారు. అలాగే స్థానిక మత్స్యకారులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

నేడు వేంపాడులో జిల్లా స్థాయి యోగా పోటీలు

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జడ్పీహెచ్ పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు జరుగుతాయని పాఠశాల హెచ్ఎం మూర్తిరాజు చెప్పారు. డీఈవో, ఎంఈవో, ఎస్.జీ.ఎఫ్ అధికారుల ఆదేశాల మేరకు వేంపాడు హైస్కూల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో నియోజకవర్గాల స్థాయిలో ఎంపికైన విజేతలతో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని, సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ప్రతిభకు ప్రోత్సాహం

రోలుగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): **ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు చదువును మధ్యలో అపేయకుండా కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తోడ్పాటు అందిస్తున్నది. ఇందులో భాగంగా జాతీయ ప్రతిభ, ఉపకార వేతన పరీక్షలో ప్రతిభ చాటినవారికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరిట తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు రూ.48 వేలు ప్రోత్సాహంగా అందుతుంది.**

పేద విద్యార్థులకు కేంద్రం ఆర్థిక ఆసరా

- నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా సాయం
- తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున నగదు చెల్లింపు
- గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 309 మంది ఎంపిక
- ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న వారికి డిసెంబరు 8న రాత పరీక్ష



ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు సన్నద్ధమవుతున్న కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వం 2008లో జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార వేతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఏటా నవంబరు లేదా డిసెంబరు నెలలో దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తున్నది. వచ్చే విద్యా సంవత్సరంలో ఎన్ఎంఎంఎస్ అమలుకు ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న వారికి డిసెంబరు 8వ తేదీన రాతపరీక్ష జరగనున్నది. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 17వ తేదీతో ముగిసింది. గత మూడేళ్లల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్ఎంఎంఎస్‌కు 985 మంది ఎంపికయ్యారు.

అర్హతలు, పరీక్ష విధానం

కేంద్ర ప్రభుత్వం ఏటా దేశ వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నది. ఏడు, ఎనిమిది తరగతుల్లో నమోదు అయిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆ ఏడాది ఏ రాష్ట్రానికి/కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్ని స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలో కేంద్రం నిర్ణయిస్తుంది.

- ప్రభుత్వ/జిల్లా పరిషత్/ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్‌కు అర్హులు. ప్రతి ఏటా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాయాలి.
- ప్రైవేటు పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు, ఆశ్రమాలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులు అనర్హులు.
- విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలకు మించకూడదు. ఏడో తరగతిలో 55 శాతం.. అంతకన్నా మార్కులు పొందితేనే పరీక్ష రాయడానికి అర్హులు
- ఎనిమిదో తరగతిలో కూడా 55 శాతం పైబడి మార్కులు వస్తేనే ఎన్ఎంఎంఎస్ పొందడానికి అర్హులు
- పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 60 శాతం పైబడి మార్కులు వస్తేనే ఇంటర్/ప్లస్-1లో ఉపకారవేతనం మంజూరు అవుతుంది.
- ఇంటర్ లేదా ప్లస్2లోనూ 55 శాతం కన్నా ఎక్కువ మార్కులు రావాలి.
- మార్కుల విషయంలో అన్ని తరగతుల్లో ఎస్సీ ఎస్టీలకు 5 శాతం తగ్గింపు వెసులుబాటు ఉంది.
- ఎంపికైన విద్యార్థికిఇ మరుసటి సంవత్సరం.. అంటే తొమ్మిది తరగతి నుంచి ఇంటర్మీడియట్/ప్లస్ 2 పూర్తయ్యే వరకు ఏటా స్కాలర్‌షిప్ అందుతుంది.
- ఇప్పటి వరకు ఏడాదిలో మూడు విడతల్లో సొమ్ము అందేది. ఇక నుంచి మొత్తం సొమ్ము ఒకేసారి మంజూరు అవుతుంది.
- తల్లిదండ్రులు, విద్యార్థి కలిపి బ్యాంకులో ఉమ్మడి ఖాతాను తెరవాలి.

పరీక్ష మూడు గంటలు.. 180 ప్రశ్నలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేయడానికి నిర్వహించే పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో విభాగానికి 90 మార్కులు కేటాయించారు. మొత్తం 180 మార్కులతో ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. మొదటి పరీక్షలో మెంటల్ ఎబిలిటీ పరీక్ష, రెండో పేపర్‌లో 7, 8 తరగతుల పాఠ్యాంశాల ఆధారంగా వుంటుంది. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. స్కాలాస్టిక్ అప్టిట్యూడ్‌లో గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల నుంచి 90 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కొక్క పాఠ్యాంశానికి 30 మార్కుల చొప్పున ప్రశ్నలు వుంటాయి.

ఉపాధ్యాయుల సూచనలు పాటించాను



ప్రస్తుతం నేను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. గతంలో రోలుగుంట మండలం కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో వున్నప్పుడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాను. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం వస్తుంది. ఇంతవరకు రెండు పర్యాయాలు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. పాఠశాలలో ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించడంతో ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించాను.

- టి.గీతామాధురి, 2022-23లో ఎన్ఎన్ఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థిని

పేద విద్యార్థులకు ఎంతో మేలు



జాతీయ ప్రతిభా ఉపకార వేతనం ప్రతిభగల పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఒక వరం వుంటిది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నగదు రూపంలో ప్రోత్సాహం వుంటుంది. మా పాఠశాల నుంచి ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం.

- ప్రసాద్, హెచ్ఎం, జడ్పీ హైస్కూల్, రోలుగుంట

నిత్య సాధనతో ఎంపిక సులువు



ఈ పరీక్షలో అత్యధిక మార్కుల సాధనకు మెంటల్ ఎబిలిటీ విభాగం కీలకం. అలాగే 7, 8 తరగతుల సైన్సు, గణితం, సాంఘిక శాస్త్రంలోని అన్ని పాఠాలను చదువుతూ ముఖ్యమైన వాటిని గుర్తించాలి. వాటిని బిట్ల రూపంలో తయారు చేసుకోవాలి. అలా స్వీయ అభ్యసనతోపాటు నిత్య సాధన అవసరం.

- కిరణ్‌కుమార్, సైన్సు ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, రోలుగుంట

కేంద్ర హోం శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఎంపీ రమేశ్

అనకాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ నియమితులయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సహాయ మంత్రులతోపాటు 15 మంది లోక్‌సభ, 13 మంది రాజ్యసభ సభ్యులు, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. కాగా హోంశాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా నియమితులైన రమేశ్‌కు కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

అనకాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు మేరకు శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ, శనివారం ఉదయం 10 గంటలకు జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు,మండల కేంద్రాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనకాపల్లిలోని నెహ్రూచౌక్‌లో జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈనెల 28న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర జిల్లాకు రానున్న నేపథ్యంలో స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దూలి రంగనాయకులు, పూతి కోటి, మళ్ల సురేంద్ర, లక్ష్మణరావు, దొడ్డి శ్రీనివాసరావు, కోట్ని బాలాజీ, నూకరాజు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రగ్బీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా రగ్బీ జట్టు

అచ్యుతాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖేల్ ఇండియా రగ్బీ పోటీల్లో పాల్గొనేందుకు అనకాపల్లి జిల్లా జట్టుని శుక్రవారం మండలంలోని భోగాపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఎంపిక చేశారు. నేషనల్ కోచ్ వెంకట్ ఆధ్వ ర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. జిల్లా జట్టుకు ఆర్.బాల, డి.వసంత, ఎన్.లీల, పి.రేఖ, జి.భారతి, బి.సంధ్య, బి.స్వర్ణరేఖ. కె.ప్రవల్లి, ఎస్.షర్మిల, పి.గంగాభవాని, జి.కావ్య, వి.రమ్య, ఎ.మానస, పి.మాధవి, ఎస్.కుసుమ(స్టాండ్‌బై) ఎంపికయ్యారు. ఈ నెల 27న నంద్యాలలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చోరీ సొత్తు రికవరీని పెంచాలి

» ఎస్పీ తుహిన్ సిన్హా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీలను అరికట్టడంతోపాటు చోరీ సొత్తు రికవరీని పెంచడమే సీసీఎస్ పోలీసుల విధి అని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దొంగతనాలు జరుగుతున్న తీరు గురించి తెలుసుకుని, వాటిని కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. ఎస్ఐల నేతృత్వంలో క్రైమ్ టీమ్‌లను ఏర్పాటు చేసి సాధ్యమైనంత వరకు చోరీ సొత్తు మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. గస్తీలను ముమ్మరం చేయాలని, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌తో అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను తనిఖీ చేయాలన్నారు. జైలు నుంచి విడుదలైన వారి కదలికలపై నిఘా కొనసాగించాలని, సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో మాట్లాడి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ(క్రైమ్) ఎల్.మోహనరావు, సీసీఎస్ ఎస్ఐ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి పశుగణన కార్యక్రమం ప్రారంభమైందని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పశుగణన పోస్టర్, గణన కిట్‌లను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాలుగు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 24 మండలాలతోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ పశుగణన చేపడతామన్నారు. సిబ్బంది జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర 16 రకాలు పశువులు, జీవాలు, పక్షుల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమానికి 294 ఎన్యూమరేటర్లు, 59 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వరి తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలి

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

తుమ్మపాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు సోకుతున్న తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు ఆదేశించారు. సాంకేతిక సమగ్ర వ్యవసాయ విధానాలపై శుక్రవారం రైతులు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిలో పొడ తెగులు, ఆకుముడత తెగులు అధికంగా వున్నట్టు గుర్తించామని, వీటి నివారణకు హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. బీపీటీ రకం వరి పైరును సుడిదోమ ఆశించిందని, దీని నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల ఎసిఫెట్ లేదా బీప్రోఫునన్ 2.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సరిత, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.శ్రీధర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అంతర కళాశాలల తైక్వాండో టోర్నీల్లో ముగ్గురు క్రీడాకారులకు స్వర్ణ పతకాలు



తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన భాస్కర్, కుసుమ, శేఖర్‌లతో కోచ్ రమేశ్

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రయూనివర్సిటీ అంతర కళాశాలల పురుషులు, మహిళల తైక్వాండో టోర్నీలో ముగ్గురు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి ఏయూ జాతీయ జట్టుకు ఎంపికైనట్టు డీఎస్ఏ కోచ్ ఎన్‌వీఎన్ రమేశ్ తెలిపారు. విశాఖలోని సాంకేతిక విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21వ తేదీన పోటీలు జరిగాయని, ఎలమంచిలిలోని రాజీవ్ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందిన ఎలమంచిలి, అచ్యుతాపురం, తిమ్మాపురం ప్రాంతాలకు చెందిన బి.కుసుమ, భాస్కర్, శేఖర్ బంగారు పతకాలు సాధించినట్టు చెప్పారు. పంజాబ్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో వచ్చే నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో ఏయూ జట్టు తరఫున వీరు పాల్గొంటారని తెలిపారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎల్.పురం జంక్షన్ దాటిన తరువాత గురువారం రాత్రి వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పాయకరావుపేట పోలీసులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. మండలంలో పీఎల్.పురం జంక్షన్ దాటిన తరువాత మార్కెట్ యార్డు ఎదుట గురువారం రాత్రి నక్కపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న వాహనం సుమారు 55 సంవత్సరాల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తిని బలంగా ఢీకొన్నది. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఇతని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని నక్కపల్లి సీహెచ్‌సీ మార్చురీకి తరలించి భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94407 96106, 83285 80990, 70133 35165 నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

నాలుగు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నాతవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తాండవ జంక్షన్‌లో వీరిని అదుపులోకి తీసుకుని నాలుగు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సాలాపువానిపాలెంలో భారీ చోరీ

» లక్ష నగదుతోపాటు 7.5 తులాల బంగారం అపహరణ

లంకెలపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లక్ష రూపాయల నగదు, ఏడున్నర తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. పరవాడ మండలం సాలాపువానిపాలెంలో శుక్రవారం జరిగిన ఈ చోరీకి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. ఎం.కోడూరు చెందిన మైచర్ల అప్పారావు గత కొన్నేళ్లుగా సాలాపువానిపాలెంలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. గురువారం ఇంటికి తాళం వేసి, కుటుంబం మొత్తం స్వగ్రామానికి వెళ్లారు. ఈ విషయం పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు తలుపు తాళం, పడక గది తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న లక్ష రూపాయల నగదు, ఏడున్నర తులాలు, బంగారం, 30 తులాలు వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. స్వగ్రామం నుంచి శుక్రవారం ఇంటికి వచ్చిన అప్పారావు.. తాళాలు పగలగొట్టి వుండడంతో చోరీ జరినట్టు గుర్తించారు. వెంటనే పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మోహనరావు, సీఐ మలికార్జునరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దొరబాబు(ఫైల్)

రోలుగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీఎన్ రోడ్డులో స్థానిక పోలీసు స్టేషన్ దాటిన తర్వాత మలుపు వద్ద గొయ్యిలో ద్విచక్ర వాహనం పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనిపై ఎస్ఐ రామకృష్ణారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన కోట దొరబాబు(33) పాన్‌షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బైకుపై రోలుగుంట వచ్చి షాపింగ్ చేసుకుని తిరిగి వెళుతుండగా పోలీసు స్టేషన్ దాటిన తరువాత బైకు అదుపు తప్పి పెద్ద గొయ్యిలో పడింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతిచెందాడు. తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

- మద్యం మత్తులో అఘాయిత్యానికి యువకుడి యత్నం
- నిలదీసి..చెంపలు వాయించిన బాలిక తల్లి
- గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా.. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని హెచ్చరిక
- న్యాయం చేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు

అచ్యుతాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఒక గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత కుటుంబీకులు గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లగా, ఎంతోకొంత నష్టపరిహారం ఇస్తారని, పోలీసుకు ఫిర్యాదు చేయవద్దని హెచ్చరించారు. అయితే తమకు న్యాయం చేయాలంటూ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు వారం రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి శుక్రవారం ఫిర్యాదు అందిందని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఫిర్యాదుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఆ గ్రామంలో ఓ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు వున్నారు. పెద్ద కుమార్తె కళాశాలలో, చిన్నకుమార్తె పాఠశాలలో చదువుతున్నారు. ఈ నెల 19వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో తమ ఇంటికి వచ్చిన అదే వీధికి చెందిన ఒక బాలుడిని అతని ఇంటి వద్ద దిగబెట్టడానికి పెద్ద అమ్మాయి వెళ్లింది. ఐదారు నిమిషాల్లో రావాల్సిన కుమార్తె.. ఎంతకీ రాకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చి ఆరా తీయడం ప్రారంభించింది. ఇదే సమయంలో కుమార్తె వణుకుతూ ఇంటికి వచ్చింది. ఎక్కడికి వెళ్లావు? ఇంతసేపు ఏం చేస్తున్నావంటూ కుమార్తెను ప్రశ్నించింది. దీంతో బాలిక కంగారుపడుతూ సమాధానం ఇవ్వడంతో ఏం జరిగిందని గట్టిగా నిలదీసింది. దీంతో బాలిక ఏడుస్తూ జరిగిన విషయం చెప్పింది. బాలుడిని వాళ్ల ఇంటి వద్ద దిగబెట్టి తిరిగి వస్తుండగా రెడ్డి అశోక్ అనే యువకుడు మద్యం సేవించి మదుంపై కూర్చుని వున్నాడని, నిన్ను (తల్లిని) ఉద్దేశించి చెడుగా మాట్లాడడని వాపోయింది. దీనిపై అతనిని మందలించగా, ఒక్క ఉదుటున తనపై దాడి చేసి, జుట్టు పట్టుకుని పక్కనే వున్న పాకలోకి తీసుకుపోయి అఘాయిత్యానికి యత్నించాడని, కాలితో తన్ని బయటకు వచ్చానని విలపిస్తూ చెప్పింది. దీంతో బాలిక తల్లి వెంటనే ఆ యువకుడి వద్దకు వెళ్లి నిలదీసింది. కోపంతో ఆ యువకుడికి చెంప దెబ్బలు వేసింది. యువకుడి తల్లితండ్రులు వచ్చి అతడిని ఇంటిలోకి తీసుకుపోయారు. ఉదయం గ్రామపెద్దల ముందు తేల్చుకుంటామంటూ బాలిక తల్లి ఇంటికి వచ్చేసింది. ఒంటినిండా గాయాలతోపాటు విపరీతమైన జ్వరంతో ఉన్న బాలికను మరుసటి రోజు ఉదయం అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించింది. ఈలోగా నిందితుడి వర్గీయులు కొంతమంది.. బాలిక తల్లి రెండు చెంపల మీద కొట్టడం వల్ల యువకుడు కోమాలోకి వెళ్లిపోయాడని,ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని గ్రామంలో ఉదంతులు లేవదీశారు. మూడు రోజులపాటు అతని గ్రామంలో కనిపించలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. నాలుగో రోజున యువకుడు ఊరిలోకి వచ్చాడు. గ్రామ పెద్దలు బాలిక కుటుంబాన్ని బెదిరించడం ప్రారంభించారు. ఈ విషయం పోలీసులకు చెబితే పరిస్థితులు దారుణంగా ఉంటాయని, ఎంతో కొంత పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. దీంతో బాలిక కుటుంబీకులు మనస్తాపంతో మనోవేదనకు గురయ్యారు. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు.